

# పసిడిమనసులు - షర్మిల



*నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!*

## చిట్టెమ్మ– సంతర్పణ

మా ఇంటి అరుగుల మీద ఇత్తడి గంగాళం, రాగి కాగులు, గిన్నెలు, పెద్ద తాంబూలం పళ్లాలు తళతళా తోమి బోర్లించి వున్నాయి. మా నాయనమ్మ, గుడి ఆచార్లు గారు ,ఈరబద్దు గుళ్లో జరగబోయే సంతర్పణ గురించి మాట్లాడుకుంటున్నారు. కార్తీకంలో మా వూళ్లో ప్రతి ఏడూ వూరిజనం అందరం కలిసి గుళ్లో భోజనాలు చేస్తాం. దాన్నే సంతర్పణ అనేవాళ్లం. అసలు ఈ సంతర్పణ మొదలెట్టింది మా చిట్టెమ్మేనంట. నలుగుర్నీ పోగేసి అందరూ భలే అనేట్టు సంతర్పణ చేసేది మా నాయనమ్మ. మా తాత కూడా పైకి తిట్టినట్టు కనిపించినా నాయనమ్మ చేసే పనులకి వెనకాల సాయం బాగానే చేసేవారు. పాలేళ్లకి ఇంటిపనులు చెప్తే చాలు పొలం పనులకు ఆలస్యం ఐపోతుందని చిటపటలాడే మనిషి, సంతర్పణ కోసం రెండు రోజులు వాళ్లు పొలంపనులకు రాకపోయినా మాట్లాడేవారు కాదు. చిట్టెమ్మ చేసే ఏ పనులకీ అడ్డు చెప్పకపోవడమే ఆయన ఆవిడకి చేసే గొప్పసాయం. ఎందుకంటే ఆవిడ పెత్తనం కట్టుకుని వూరందరినీ పోగేసి చేసే ఇట్టాంటి పనులకి ఇంట్లో మగాడు టట్ కుదరదంటే ఆమె మాత్రం ఏంచేసేది. సంతర్పణ కి కావాల్సిన సామాన్లు పోగు చేయడంతో పనులు మొదలయ్యేవి.

తర్వాత భోజనాలకు కావలసిన సంభారాలు వూళ్లో వాళ్లనుంచి పోగుచేయడానికి తలో గోనె సంచి, కొన్ని చిన్న సంచులిచ్చి కుర్రాళ్లని వూర్లోకి పంపేది. పెద్ద గోనెసంచిలో బియ్యం, చిన్న సంచుల్లో మిరపకాయలు, చింతపండు, బెల్లం, పప్పులు ,కూరగాయలు వేసే వారు వూరి జనం. వీటన్నింటినీ గుడి దగ్గరికి తీసికెళ్లేవాళ్లు. ఆ సాయత్రం పాడి వున్న రైతులంతా చెంబులతో పాలు పంపేవారు. వాటిని కళాయి వున్న పెద్ద గంగాళం లో ఎర్రగా మరగ కాసి మర్నాడు పెరుగు కోసం తోడు పెట్టే వారు.

ఇక మర్నాడు సంతర్పణ జరిగేది. వంటపని అంతా ఆడంగులంతా కబుర్లు చెప్పుకుంటూ కూరగాయలు కొయ్యటం దగ్గర్నుంచి వంటలు చేయడం వరకూ ఆడతా పాడతా చేసేవారు. ఆడాళ్లు వుసిరి చెట్టుకి పూజలు చేశాకా భోజనాలు మొదలయ్యేవి. పులిహోర,పాయసం, ముద్ద పప్పు, గుమ్మడి కాయ, సొరకాయ,ములక్కాయ ముక్కలు వేసి పెట్టిన ఘుమఘుమలాడే దప్పళం, నేతిబీరకాయ పచ్చడి, ఏదో ఒక వేపుడు , కమ్మటి నెయ్యి, గడ్డ పెరుగుతో అంతా తృప్తిగా భోజనాలు చేసేవారు.

భోజనాలయ్యాక అంతా భుక్తాయాసంతో ఎవరిళ్లకి వాళ్లు వెళ్లే వారు. మా చిట్టెమ్మ మాత్రం ఒక ఇద్దరు మనుషుల్ని బతిమాలుకుని అక్కడ శుభ్రం చేయించడం, మిగిలిన వంటలని కావాల్సినవాళ్లకి పంచడం వంటివి చేసి ఎప్పుడో దీపాలు పెట్టే వేళకి ఇల్లు చేరేది. మళ్లీ ఇత్తడి సామాన్లన్నీ అటకెక్కేవి. చిట్టెమ్మ వున్నన్ని రోజులూ సంతర్పణ జరిగింది. చిట్టెమ్మ తరవాత మాత్రం ఆ ఇత్తడి సామాన్లతో ఎవరికీ పని రాలేదు. సంతర్పణ సందడీ లేదు. అటకెక్కిన ఆ ఇత్తడి సామాన్లు కిలుంపట్టి పోయాయి. ఆ సంగతులన్ని గుర్తొస్తే తళతళలాడే జ్ఞాపకాలన్నీ ఆ సామాన్ల లాగానే మసకబారినట్టవుతుంది. *(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

COMMENTS